# సాక్షి పశ్చిమగోదావరి

మంగళవారం । 28 । మే । 2024




**కందుకూరికి నివాళి**

కందుకూరి వీరేశలింగం వర్ధంతి సందర్భంగా సీఆర్ రెడ్డి డిగ్రీ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కందుకూరి ఆశయ సాధనకు పిలుపునిచ్చారు. 8లో



**ఆహ్లాదం కనుమరుగు**

ఆటపాక పక్షుల విహార కేంద్రం కళ తప్పింది. వేసవిలో పక్షుల ఆవాస చెరువు నీటి మట్టం అడుగునకు చేరడంతో బోటు షికారు నిలిచిపోయింది. 8లో



**వైభవంగా వైశాఖ పూజలు**

శైవక్షేత్రం నత్తారామేశ్వరంలో శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో వైశాఖ మాసం మూడో సోమవారం కావడంతో భక్తులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. 8లో

## న్యూస్‌రీల్

### రాట్నాలమ్మ హుండీ లెక్కింపు



రాట్నాలమ్మ దేవస్థానంలో హుండీ లెక్కిస్తున్న దృశ్యం

పెదవేగి : రాట్నాలకుంటలో వేంచేసిన రాట్నాలమ్మ వారి హుండీ లెక్కింపు సోమవారం నిర్వహించారు. రూ.11,77,408 ఆదాయం లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్‌కుమార్ చెప్పారు. లెక్కింపునకు ఏలూరు పత్తేబాద శివాలయ కార్యనిర్వహణాధికారి శంకర్ పర్యవేక్షణాధికారిగా వ్యవహరించారు. కార్యక్రమంలో మాజీ ఆలయ చైర్మన్ చల్లగొళ్ళ వెంకటేశ్వరరావు, గరికిముక్కు సర్వేశ్వరరావు, పాకలపాటి వెంకటేశ్వరరావు, మేరుగు వెంకటేశ్వరరావు, మేరుగు వెంకటేశ్వరరావు, నంబూరి జనార్ధన్‌రావు, ఈడా ధర్మరావు, గ్రామస్తులు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### తెన్నేటికి సన్మానం



తెన్నేటి లక్ష్మీ నరసింహమూర్తిని సన్మానిస్తున్న దృశ్యం

పాలకోడేరు : పాలకోడేరు జెడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అక్షర కిరీటి తెన్నేటి లక్ష్మీ నరసింహమూర్తిని హైదరాబాద్‌కు చెందిన రితిక ఫౌండేషన్ ఆదివారం విజయవాడ కవితా మార్తాండ బిరుదు ఇచ్చి బెస్ట్ నంది అవార్డు 2024తో సన్మానించింది. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నిత్యాచారి మాట్లాడుతూ తెన్నేటి మాస్టారు ఇంతవరకూ పదహారు స్వీయ రచనల పుస్తకాలు ప్రచురించారని, ఆ పుస్తకాలపై యూనివర్సిటీల్లో పరిశోధనలు చేసి డాక్టరేట్ పొందారని, ఆయనను సన్మానం చేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ముఖ్య అతిథి కుందుర్తి నరసింహశర్మ రితిక ఫౌండేషన్ ఏటా కవులను, కళాకారులను సన్మానించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో కృష్ణ, శ్రీ పద్మిని పుర కళాపీఠం గౌరవ అధ్యక్షుడు ఆర్‌వీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

### కవి ప్రసాద్‌కు స్వర్ణకంకణం



ఏలూరులో కవి ప్రసాద్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

తణుకు : శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఏలూరులో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ పద్య కవుల కవి సమ్మేళనంలో తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ కవి వీఎస్‌వీ ప్రసాద్‌కు స్వర్ణకంకణం బహూకరించారు. వేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో ఏలూరు వైఎంహెచ్‌ఏ హాలులో నిర్వహించిన ఈ సమ్మేళనంలో ప్రసాద్ రచించి, వినిపించిన సీస పద్యాలకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఏలూరు శాఖ అధ్యక్షుడు కోటి శ్రీహరి, మానవత విద్యానిధి చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు తదితరులు అభినందించారు.

# కౌంటింగ్ పైనే.. అందరి చూపు

- జూన్ 4న ఓట్ల లెక్కింపునకు చురుగ్గా ఏర్పాట్లు
- అందరిలోనూ ఉత్కంఠ
- ఎక్కడ చూసినా ఎన్నికల ఫలితాలపైనే చర్చలు
- విజయంపై ధీమాలో వైఎస్సార్‌సీపీ కేడర్



సాక్షి, భీమవరం: సార్వత్రిక ఓట్ల లెక్కింపు గడువు సమీపిస్తున్న కొద్దీ అందరిలో ఉత్కంఠ పెరుగుతోంది. ఎక్కడ చూసినా కౌంటింగ్‌పైనే చర్చ.. ఏ ఇద్దరూ కలిసినా విజయం ఎవరిని వరిస్తుందనే అంశంపైనే విశ్లేషణలు. మరో పక్క జూన్ 4న భీమవరంలోని శ్రీవిష్ణు, ఎస్‌ఆర్‌కేఆర్ కళాశాలల్లో కౌంటింగ్‌కు శరవేగంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జూన్ 1న చివరి దశ ఎన్నికలు జరగనున్నాయి. జూన్ 4న ఓట్ల లెక్కింపు చేయనున్నారు. జిల్లాలోని నరసాపురం పార్లమెంట్, భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం, ఆచంట, నరసాపురం, ఉండి అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. 2019లో ఏప్రిల్ 11న ఎన్నికలు జరగ్గా ఫలితాల కోసం 41 రోజులు ఎదురుచూడాల్సి వచ్చింది. ఈ సారి 21 రోజులు వేచి ఉండాల్సిన పరిస్థితి.

**ఆరు రోజులే గడువు**

కౌంటింగ్‌కు నేటికి మరో ఆరు రోజులు మాత్రమే గడువుంది. వచ్చే మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. ఒక్కో రౌండుకు 20 నిముషాల నుంచి అరగంట సమయం పడుతుంది. ఈ మేరకు మధ్యాహ్నం 1.30 నుంచి రెండు గంటల సమయానికి నరసాపురం ఫలితం వెలువడుతుంది. రెండున్నర గంటలకు ఆచంట, పాలకొల్లు, మూడు గంటలకు తాడేపల్లిగూడెం, తర్వాత భీమవరం, తణుకు, ఉండి ఫలితాలు వస్తాయని అంచనా. పోలింగ్ సరళిని బట్టి ఇప్పటికే పోటీలో నిలిచిన అధికార, విపక్ష పార్టీల అభ్యర్థులు, వారి అనుచరులు గ్రామాలు, వార్డుల వారీగా తమకు వచ్చే ఓట్లుపై అంచనాల్లో ఉన్నప్పటికి గడువు సమీపిస్తుండటంతో ఉత్కంఠ పెరిగిపోతోంది. కౌంటింగ్ రోజు కోసం ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోపక్క గ్రామాలు, పట్టణాల్లో ఏ ఇద్దరు కలిసినా ఎన్నికల ఫలితాలపైనే చర్చించుకుంటున్నారు. నరసాపురం పార్లమెంట్, జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో పోటీలోని అభ్యర్థుల విజయావకాశాలు, విజయం సాధిస్తారనుకునే వారి మెజారిటీ ఎంత వరకు రావచ్చు? రాష్ట్రంలోని ముఖ్యనేతల విజయావకాశాలు? ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది? అదే విధంగా కేంద్రంలో ఏ పార్టీ సంపూర్ణ ఆధిక్యత సాధిస్తుంది? గత ఎన్నికల ఫలితాలను బేరీజు వేస్తూ పలు అంశాలపై ఎక్కడ చూసిన జోరుగా చర్చలు జరుగుతున్నాయి.

**విజయంపై వైఎస్సార్‌సీపీ ధీమా**

2019 ఎన్నికల్లో రాష్ట్రంలో 175 స్థానాలకు 151 స్థానాలతో వైఎస్సార్‌సీపీ చారిత్రాత్మక విజయం సాధించింది. జిల్లాలోని నరసాపురం పార్లమెంట్‌తో పాటు ఏడు స్థానాలకు ఐదింట విజయకేతనం ఎగురవేసింది. ఈ ఐదేళ్లలో కనివినీ ఎరుగని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాధించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, కూటమిలోని అంతర్గత కుమ్ములాటలతో ఈ ఎన్నికల్లో జిల్లాలో క్లీన్‌స్వీప్ ఖాయమన్న ధీమాలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఉన్నారు. పోలింగ్ శాతం పెరగడం, అర్ధరాత్రి వరకు వృద్ధులు, మహిళలు క్యూలో నిలబడి ఓటు వేయడం పాజిటివ్ ఓటుకు నిదర్శనమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



**శరవేగంగా ఏర్పాట్లు**

భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలకు పట్టణంలోని ఎస్‌ఆర్‌కేఆర్ కళాశాల, తణుకు, అచంట, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాలకు శ్రీవిష్ణు కళాశాలలో ఓట్ల లెక్కింపు జరుగనుంది. అందుకోసం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ నేతృత్వంలో శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఒక్కో నియోజకవర్గానికి ఆర్‌ఓ, ఏఆర్‌ఓలతో పాటు కౌంటింగ్‌కు ఒక్కో టేబుల్ వద్ద ఒక మైక్రో అబ్జర్వర్, ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్, సపోర్టింగ్ స్టాఫ్ తదితరులు కలిపి 1500 మంది వరకు సిబ్బంది కౌంటింగ్ విధుల్లో పాల్గొననున్నారు. ఎక్కడ పొరపాట్లకు తావులేకుండా సమర్థవంతంగా కౌంటింగ్ జరిగేలా వివిధ స్థాయిల్లో ఉద్యోగులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రతిరోజు సమీక్షలు నిర్వహిస్తు అవసరమైన సూచనలు అందిస్తున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఎస్పీ డాక్టర్ అజిత పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు.

## పాలిటెక్నిక్ కౌన్సెలింగ్ ప్రారంభం



పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ ప్రక్రియ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సీట్ల భర్తీకి సంబంధించి కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభమైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సత్యనారాయణ తెలిపారు. సివిల్ ఇంజనీరింగ్ 60 సీట్లు, మెకానికల్ ఇంజనీరింగ్ 60 సీట్లు ఉన్నాయని చెప్పారు. 1 నుంచి 12 వేల ర్యాంక్ వరకు సోమవారం కౌన్సెలింగ్ జరిగినట్లు తెలిపారు.

## జూన్ 1న జెడ్పీ సర్వసభ్య సమావేశం

ఏలూరు (మెట్రో): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జూన్ 1న ఏలూరులోని జెడ్పీ సమావేశం మందిరంలో నిర్వహిస్తామని జెడ్పీ సీఈఓ కె. సుబ్బారావు తెలిపారు. సమావేశానికి జెడ్పీ అధ్యక్షురాలు ఘంటా పద్మశ్రీ అధ్యక్షత వహిస్తారని, సమావేశానికి జిల్లా పరిషత్ సభ్యులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

# పకడ్బందీ ఏర్పాట్లకు ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అధికారులు

భీమవరం(ప్రకాశంచౌక్) : జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లను పగడ్బందీగా చేసుకోవాలని ప్రధాన ఎన్నికల కమిషనరు రాజీవ్ కుమార్ ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ కచ్చితమైన ఫలితాలు ప్రకటించాలన్నారు. ఐదు దశల్లో ఎన్నికలు జరిగిన రాష్ట్రాల సీఈవోలు, జిల్లాల ఎన్నికల అధికారులతో ఎలక్షన్ కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, డా.సుఖ్‌బీర్ సింగ్‌తో కలసి సోమవారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. కలెక్టరేటు వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టరు సుమిత్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఓట్ల లెక్కింపు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పక్కా ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నామని, కౌంటింగుకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని సుమిత్ కుమార్ వివరించారు. ఈవీఎంలో పోల్ అయిన ఓట్ల లెక్కింపునకు సంబంధిచి ఎన్నికల అధికారులు, సిబ్బందికి ముందస్తుగా సరైన శిక్షణ ఇవ్వాలని రాజీవ్ కుమార్ సూచించారు. సుశిక్షితులైన ఎన్నికల సిబ్బందితో పాటు హైస్పీడు ఇంటర్నెట్ సౌకర్యం, కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్ వంటి ఐటీ పరికరాలను ముందస్తుగా ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించే విషయంలో ఆలస్యం చేయవద్దని, డిస్‌ప్లే బోర్డుల ద్వారా ఎప్పటికప్పుడు కచ్చితమైన ఎన్నికల ఫలితాలను ప్రకటించాలని అన్నారు.

**నిబంధనల మేరకు కౌంటింగ్ నిర్వహించాలి**

సార్వత్రిక ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు బాధ్యతగా మెలగాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిబంధనలకు లోబడి మాత్రమే ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ ప్రారంభమైన సమయం నుంచి పూర్తయ్యే వరకు సిబ్బంది ఎవరు కౌంటింగ్ హాలును వదిలి బయటకు రాకూడదన్నారు. ప్రత్యేకంగా భోజన విరామం ఉండదని, కౌంటింగ్ హాల్లోనే విధుల్లో ఉన్న సిబ్బందికి ఆహారం అందిస్తారన్నారు. కౌంటింగ్ ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడంతో పాటు, ప్రతి విషయాన్ని మరి ఒకసారి చెక్ చేసుకోవాలని తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు, తదితరులకు పాసుల జారీని జూన్ 2 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు అభినందనలు తెలిపిన ఉమాబాల



కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీకి అభినందనలు తెలుపుతున్న గూడూరి ఉమాబాల

భీమవరం(ప్రకాశంచౌక్): పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల సుమిత్ కుమార్ గాంధీని వైఎస్సార్‌సీపీ నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి గూడూరి ఉమాబాల మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు.



ఏలూరులో ఓ శిక్షణ కేంద్రంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న మహిళా ట్రైనర్

# మార్షల్‌ఆర్ట్స్‌పై మక్కువ

ఆత్మస్థైర్యం.. ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్‌పై మక్కువ పెంచుకుంటున్నారు. ముఖ్యంగా బాలికలు, మహిళలకు ఆపద సమయాల్లో ఈ విద్య అక్కరకొస్తుంది. ఆరోగ్యపరంగానూ ఫిట్‌గా ఉండేందుకు ఈ విద్య దోహదం చేస్తుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి మున్సిపాలిటీలోనూ ఈ మార్షల్ శిక్షణ కేంద్రాలు ఉన్నాయి. వేసవిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ఔత్సాహికులకు శిక్షణ ఇస్తున్నారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు



కుంగ్‌ఫూలో మెళకువలు నేర్చుకుంటున్న చిన్నారులు





# 30 నుంచి నాటక పోటీలు



నాటక పోటీల బ్రోచర్ విడుదల చేస్తున్న రాయప్రోలు భగవాన్ తదితరులు

భీమవరం: ఈ నెల 30, 31, జూన్ 1, 2 తేదీల్లో భీమవరం డీఎన్నార్ కళాశాల క్రీడా మైదానంలో చైతన్య భారతి 17వ జాతీయ స్థాయి నాటిక పోటీలను నిర్వహిస్తున్నట్లు చైతన్య భారతి నాటక పరిషత్ అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్ తెలిపారు. సోమవారం మాట్లాడుతూ.. 30న సినీ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణకు ఆత్మీయ చైతన్య పురస్కారం, రంగస్థల నటుడు డాక్టర్ పురాణం వెంకట రామ్‌కుమార్‌కు జవ్వాది రంగస్థల చైతన్య పురస్కారం, రంగస్థల నటుడు ఎస్ఎం భాషాకు మైనంపాటి రంగనాయకులు రంగస్థల చైతన్య పురస్కారం, జూన్ 2న అప్పాజోస్యుల సత్యనారాయణకు రాయప్రోలు రామచంద్ర మూర్తి రంగస్థల చైతన్య పురస్కారం, నటీమణి ఎం.రత్నకుమారికి పెనుపోతుల శేషగిరిరావు చైతన్య పురస్కారం అందిస్తామన్నారు. జూన్ 2న జరిగే కార్యక్రమానికి సినీ హాస్యనటుడు సూరంపూడి సుదర్శనరావు, దర్శకులు రాజా వన్నెంరెడ్డి తదితరులు హాజరవుతున్నారని తెలిపారు. సమావేశంలో రాయప్రోలు శ్రీనివాసమూర్తి, పీఆర్‌ఓ భట్టిప్రోలు శ్రీనివాసరావు, డాక్టర్ కట్రెడ్డి సత్యనారాయణ, పెన్నాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# భానుడి భగభగలు ప్రారంభం

**జిల్లాలో ఒక్కసారిగా పెరిగిన ఉష్ణోగ్రతలు**



తణుకులో నిర్మానుష్యంగా వెంకటేశ్వర థియేటర్ కూడలి

తణుకు: జిల్లాలో ఎండలు మండుతున్నాయి.. అల్పపీడనం, తుఫాన్ ప్రభావంతో కొద్దిరోజులుగా ఎండ తీవ్రత తక్కువగానే ఉన్నా.. సోమవారం నుంచి తీవ్రత పెరిగింది. రోహిణీ కార్తె ప్రారంభం కావడంతో భానుడి భగభగలు మరింత పెరుగుతాయని ఆందోళన చెందుతున్నారు. మధ్యాహ్నం 11 గంటల నుంచే వడగాల్పులు వీస్తున్నాయి. తణుకులో సోమవారం 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. తణుకు నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారి, వేల్పూరు రోడ్డు, ఇతర ప్రధాన సెంటర్లు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు వెలవెలబోతున్నాయి. ప్రారంభంలో ఎండల తీవ్ర అంతగా లేక అంతంతమాత్రంగా సాగిన ఏసీలు, ఎయిర్ కూలర్లు, ఫ్రిజ్‌ల అమ్మకాలు గత వారం రోజుల నుంచి గణనీయంగా పెరుగుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. జూన్ మొదటి వారం వరకు ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన సంగతి తెలిసిందే..

**జీవనోపాధిపై ప్రభావం**

ఉష్ణోగ్రతలు పెరగడంతో చిరువ్యాపారుల జీవనోపాధిపై ప్రభావం చూపుతుంది. తినుబండారాలు, రోడ్డుపక్కనే ఇతరత్రా వ్యాపారాలు సాగించే చిరువ్యాపారులు ఎండ తీవ్రతకు వ్యాపారాలు చేయలేకపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే పలు కూడళ్లు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. వడగాల్పుల నేపథ్యంలో కనీస జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

## క్లుప్తంగా

### ఎలక్ట్రిక్ స్కూటర్ దగ్ధం



మంటల్లో కాలిపోతున్న ఎలక్ట్రిక్ స్కూటర్

తణుకు: పట్టణంలోని ఎలక్ట్రిక్ స్కూటర్‌లో మంటలు చెలరేగి క్షణాల వ్యవధిలోనే అగ్నికి ఆహుతైంది. వివరాలిలా ఉన్నాయి. స్థానిక మీనాక్షి మెడికల్స్ యజమాని జి.ముత్యాలరావుకు చెందిన ఎలక్ట్రిక్ స్కూటర్ సోమవారం ఎన్జీవో హోం రోడ్డులోని ఎస్‌బీఐ ఎదురుగా పార్కింగ్ చేసి ఉండగా అకస్మాత్తుగా బ్యాటరీ నుంచి మంటలు చేలరేగాయి. తణుకు అగ్నిమాపక శాఖ అధికారి ఐ.అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.లక్ష ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

### బాలికపై లైంగిక దాడి కేసులో వ్యక్తికి రిమాండ్

తణుకు: ఏడేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి కోర్టు రిమాండ్ విధించినట్లు తణుకు పట్టణ ఎస్సై కె.శ్రీనివాస్ సోమవారం చెప్పారు. స్థానిక ఎన్టీఆర్ పార్కు సమీపంలో నివాసం ఉంటున్న చదలవాడ తిమోతి తన ఇంటి సమీపంలో ఆడుకుంటున్న ఏడేళ్ల బాలికకు మాయమాటలు చెప్పి ఆదివారం ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై పట్టణ పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసి సోమవారం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు వెల్లడించారు.

### లారీ ఢీకొని వృద్ధురాలి మృతి



గాయాలపాలైన వృద్ధురాలికి సపర్యలు చేస్తున్న ఓ మహిళ

ఆకివీడు: అజ్జమూరులో రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొనడంతో ఓ వృద్ధురాలు మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. అజ్జమూరుకు చెందిన పీతల నందమ్మ (65) మందు బిళ్లలు కొనేందుకు సోమవారం వెళ్లి తిరిగి వస్తుండగా, అజ్జాలమ్మ గుడి వద్దకు వచ్చేసరికి ఆకివీడు నుంచి కుప్పనపూడి వైపు వెళుతున్న ఓ లారీ వేగంగా వస్తూ వృద్ధురాలిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మనవరాలి ఫిర్యాదు మేరకు ఎస్సై బి.నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఆహ్లాదం.. కనుమరుగు

- కళ తప్పిన ఆటపాక పక్షుల విహార కేంద్రం
- 15 రోజుల క్రితం నిలిచిన బోటు షికారు
- పక్షుల విహార చెరువులో తగ్గిన నీటిమట్టం
- నిరాశగా వెనుదిరుగుతున్న పర్యాటకులు

కైకలూరు: పక్షి ప్రేమికులకు స్వర్గధామంగా పేరు పొందిన ఆటపాక పక్షుల విహార కేంద్రం కళ తప్పింది. వేసవిలో పక్షుల ఆవాస చెరువు నీటి మట్టం అడుగునకు చేరింది. దీంతో పర్యాటకులు ఎంతో ఇష్టపడే బోటు షికారు నిలిచింది. ప్రతి వేసవిలో చెరువులో నీరు నింపడంలో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. దీంతో అటవీశాఖ అధికారులు శాశ్వత పరిష్కారాన్ని అమలు చేయాలని పక్షి ప్రేమికులు కోరుతున్నారు. ఇక్కడ పరిస్థితి తెలియక సుదూర ప్రాంతాలను నుంచి వచ్చే పర్యాటకులు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

రాష్ట్రంలో ఆటపాక పక్షుల విహార కేంద్రానికి మంచి పేరుంది. విదేశాల నుంచి పెలికాన్ (గూడబాతు)లు అధిక సంఖ్యలో ఆటపాక రావడంతో ఇక్కడ కేంద్రానికి పెలికాన్ ప్యారడైజ్‌గా నామకరణ చేశారు. అటవీశాఖ అంబాసిడర్‌గా పెలికాన్ పక్షిని ఎంపిక చేసుకుంది. ఈ కేంద్రంలో పెలికాన్‌తో పాటు పెయింటెడ్ స్ట్రాక్స్, వైట్ ఐబీఎస్, గ్లోబీ ఐబీఎస్, ఓపిన్ బిల్, గ్రే హెరాన్ ఇలా పలు రకాల విదేశీ, స్వదేశీ పక్షులు విహరిస్తుంటాయి. చిన్నారులకు అదనపు ఆకర్షణగా పక్షి నమూనా మ్యూజియం, చిల్డ్రన్స్ పార్కు అందుబాటులో ఉన్నాయి. పక్షులు సంతానోత్పత్తి సాగించడానికి వీలుగా అటవీశాఖ చెరువులో కృత్రిమ ఇనుప స్టాండ్లను ఏర్పాటు చేసింది.





ఆటపాక పక్షుల కేంద్రంలో నిలిచిన బోట్లు

**చెరువులో అడుగంటిన నీరు**

ఎండల ప్రభావం వల్ల నీరు అడుగంటడంతో చెరువులో బోటు షికారు 15 రోజులుగా నిలిచిపోయింది. కేవలం పక్షులు విహరించడానికి 289 ఎకరాల్లో అటవీశాఖ చెరువును ఇక్కడ ఏర్పాటు చేసింది. సాధారణంగా చెరువులో బోటు షికారుకు 6 అడుగుల నుంచి 4 అడుగుల నీరు అవసరం. అటువంటిది కేవలం ఒక అడుగుకు నీటి మట్టం చేరింది. దీంతో బోట్లు నడపడం కష్టతరమవుతోంది. పక్షుల విహార కేంద్ర సందర్శనలో అత్యంత మనోహరమైంది బోటు షికారే. దీనిలో విహరిస్తూ పక్షులను దగ్గర నుంచి చూసే అవకాశం ఉంటుంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు బోటు షికారు లేకపోవడంతో వెనుదిరుగుతున్నారు.

**ప్రతి ఏటా చెరువులో నీటి సమస్య**

ఆటపాక పక్షుల కేంద్రం చెరువులోకి సమీప నాగరాజు కాల్వ నుంచి నీటిని తోడుతారు. వర్షకాలంలో కాల్వ పొంగినప్పుడు చెరువు తూములను తెరవడంతో నీరు చేరుతోంది. అదే విధంగా పోల్‌రాజ్ డ్రెయిన్ నీటిని కూడా చెరువులోకి తోడుకునే అవకాశం ఉంది. వేసవికి ముందు మోటార్ల ద్వారా నీటిని అటవీశాఖ తోడుతుంది. గత డిసెంబర్ నెలలో వర్షపు నీటిని నింపడంతో ఇప్పుడు అడుగు నీరు మాత్రమైన ఉంది. ఆటపాక పంచాయతీలో పంట కాల్వ నుంచి నేరుగా ఆటపాక పక్షుల కేంద్రం చెరువుకు నీటి పైపులను ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారమవుతోందని, అదే విధంగా చెరువు లోతును పెంచి గట్లను పటిష్ట పరిస్తే నీరు నిల్వ పెరిగే అవకాశాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.

**ఈ ఏడాదే కాస్త ఫర్వాలేదు**



ఆటపాక పక్షుల విహార కేంద్రం చెరువులో డిసెంబర్ నెలలోనే నీటితో నింపాం. ఉష్ణోగ్రతలు పెరగడంతో నీరు ఆవిరవుతోంది. వర్షాలు రాగానే పూర్తి స్థాయిలో నీటిని నింపుతాం. ప్రతి ఏడాదీ మోటార్లు ఉపయోగించి నీరు తోడుతున్నాం. గత వేసవిలో పూర్తిగా చెరువు ఎండింది. ప్రస్తుతం కొంత నివారించగలిగాం.

– జీవీవీ జయప్రకాష్, డెప్యూటీ ఫారెస్టు రేంజర్, కైకలూరు

### ప్రజల వద్దకే బ్యాంకింగ్ సేవలు



ఖాతాదారులకు రుణాలు అందిస్తున్న యూనియన్ బ్యాంకు రీజనల్ అధికారి శ్రీనివాస్

ఏలూరు (మెట్రో): ప్రజల వద్దకే బ్యాంకింగ్ సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని యూనియన్ బ్యాంకు రీజనల్ అధికారి నాంపల్లి శ్రీనివాస్ అన్నారు. స్థానిక విజయవిహార్ సెంటర్‌లో రిటైల్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రజలకు అందుబాటులో బ్యాంకింగ్ సేవలను ఉంచుతున్నామన్నారు. 64 శాఖల ద్వారా ఇప్పటికే రూ.9,750 కోట్ల వ్యాపారం నిర్వహించామని, రిటైల్ వ్యాపారంలో ఇప్పటివరకు రూ.803 కోట్ల వ్యాపారం చేసి ఈ ఆర్థిక సంవత్సరంలో 20 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ప్రజలకు గృహరుణాలు, వాహనాల రుణాలు, వ్యక్తిగత రుణాలు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నామని చెప్పారు. రుణాలు అందించడంలోనూ ప్రజలకు చేరువగా యూనియన్ బ్యాంకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ అధికారి ఎస్.సంతోష్, బి.హేమంతరావు, ఎల్‌డీఎం డీ.నీలాద్రి పాల్గొన్నారు. ఎక్స్‌పో కార్యక్రమంలో భాగంగా ఖాతాదారులకు పలు సేవలను అందించారు.

## వైభవంగా శ్రీరామలింగేశ్వరుడికి వైశాఖ పూజలు



విశేష అలంకరణలో పరశురాముడు ప్రతిష్ఠించిన గోస్తనీ గర్భంలోని రామలింగేశ్వరస్వామి



విశేష అలంకరణలో సీతారాములు ప్రతిష్ఠించిన నత్తా రామలింగేశ్వరస్వామి

నత్తారామేశ్వరంలో శైవక్షేత్రానికి పోటెత్తిన భక్తజనం

పెనుమంట్ర: సుప్రసిద్ధ శైవక్షేత్రమైన నత్తారామేశ్వరం గ్రామంలో పరశురాముడు ప్రతిష్ఠించిన గోస్తనీ గర్భంలో ఉన్న ఆలయంలోని శ్రీరామలింగేశ్వరస్వామి దర్శనానికి సోమవారం భక్తులు పోటెత్తారు. వైశాఖమాసంలో మాత్రమే దర్శనమిచ్చే ఈ స్వామికి వైశాఖ మాసం మూడో సోమవారం కావడంతో భక్తులు ఏకాదశ రుద్రాభిషేకాలు, మహాన్యాస పూర్వక అభిషేకాలు, అభిషేక పండితులు కాశీభట్ల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు సాయంత్రం వరకు క్యూలో నిల్చుని స్వామివారిని దర్శించుకున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం, క్యూలైన్లలో నిల్చున్న భక్తులకు మజ్జిక, బెల్లంపానకం, పులిహోర, చక్రపొంగలి ప్రసాదంగా అందజేశారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అమ్మభగవాన్ భక్త బృందం భక్తులకు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

## రొయ్యలను దొంగిలించిన కాపలాదారుడిపై కేసు

ఉండి: చెరువుపై కాపలాగా ఉంటూ అదే చెరువులోనే రొయ్యలు దొంగతనం చేసిన ఓ వ్యక్తిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గాదిరాజు వెంకట సత్యనారాయణరాజు అనే వ్యక్తి ఉండి ఉప్పుగుంట రోడ్డులో రొయ్యల చెరువు సాగు చేస్తున్నాడు. అతనికి చెరువుకు కాపలాగా కైకలూరు మండలం పెదయడ్లగాడి గ్రామానికి చెందిన ఏసుబాబు ఉంటున్నాడు. ఇదిలా ఉండగా, ఆదివారం అర్ధరాత్రి యజమాని చెరువులోనే రొయ్యలు దొంగతనంగా పట్టుకుని అమ్మకానికి తీసుకువెళుతుండగా గమనించిన చుట్టుపక్కల రైతులు అతనిని పట్టుకుని యజమానికి ఫోన్ చేశారు. యజమాని వచ్చేలోపుగా పట్టుకున్నవారిని విదిలించుకుని నిందితుడు పరారయ్యాడు. దీంతో చెరువు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై ఎం లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

ఉండి: ఉండికి చెందిన 35 ఏళ్ల వివాహిత అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వివాహిత భీమవరంలోని ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తోంది. రోజు మాదిరిగానే ఈ నెల 26న ఉదయం భీమవరం వెళుతున్నానని చెప్పి తిరిగి రాలేదు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కందుకూరి ఆశయ సాధనే లక్ష్యం



'కార్యశూరుడు కందుకూరు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు



చిన్నారుల నృత్య ప్రదర్శన

- ఏలూరులో 'కందుకూరి 105వ వర్ధంతి సమాలోచన'లో వక్తలు
- ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం ఆశయాల సాధనే ఆయనకు మనమిచ్చే ఘన నివాళి అని వక్తలు అన్నారు. కందుకూరి వీరేశలింగం వర్ధంతి సందర్భంగా స్థానిక సీఆర్ రెడ్డి డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో సోమవారం కందుకూరి 105వ వర్ధంతి నిర్వహణ కమిటీ, సీఆర్ రెడ్డి విద్యాసంస్థలు తెలుగు విభాగం సంయుక్తంగా 'కందుకూరి 105వ వర్ధంతి సమాలోచన' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం, మానవత, జన విజ్ఞాన వేదిక, హిందూ యువ జన సంఘం, జిల్లా రచయితల సంఘం, హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం వంటి 115 సంఘాలతో కందుకూరి 105వ వర్ధంతి నిర్వహణ కమిటీ ఏర్పడింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి పలు కళా ప్రదర్శనలు నిర్వహించారు. ముందుగా జన విజ్ఞాన వేదిక నాయకులు చేతిపై కర్పూరం వెలిగించి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం కందుకూరి వీరేశలింగం చిత్రపటానికి పూలమాల, పుష్పాలతో నివాళులు అర్పించారు. ప్రముఖ నాట్యాచార్యులు పార్వతి రామచంద్రం శిష్యబృందం, రామానుజ నృత్యధార విద్యార్థులు, స్వర్ణ నృత్యాలయ విద్యార్థులు పలు నృత్య ప్రదర్శనలు చేశారు. విజయవాడకు చెందిన ప్రజా గాయకులు ఆకురాతి, ప్రజా నాట్యమండలి గాయకులు పి.మంగరాజు ఆలపించిన గేయాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అలాగే కళాకారుడు హమీద్ ప్రదర్శించిన కందుకూరి వీరేశలింగం ఏకపాత్రాభినయం విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం జరిగిన సదస్సుకు అధ్యక్షత వహించిన ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ 105కు పైగా సంఘాలు, పలువురు కళాకారులు, గాయకులు ఒకే వేదికపై ఈ కార్యక్రమాన్ని జరిపిస్తున్నామని తెలిపారు. కందుకూరి మంచి సంఘ సంస్కర్త, అభ్యుదయ వాది, పోరాటయోధుడు, కవి, ఉపాధ్యాయుడు, రచయిత అని, అన్ని మంచి లక్షణాలు ఒకే వ్యక్తిలో ఉండటం గొప్ప విషయమన్నారు. సీఆర్ రెడ్డి కళాశాల రిటైర్డ్ అధ్యాపకులు ఇమ్మానుయేల్ మాట్లాడుతూ దేశంలో ఉన్న అనేక సాంఘిక దురాచారాలను రూపుమాపటంలో కందుకూరి వీరేశలింగం ఎంతో శ్రమించారన్నారు. పత్రికలు స్థాపించి ప్రజలను చైతన్యపరిచారని, బాల్యవివాహాలు అరికట్టడంలో, వితంతు వివాహాలు జరిపించడంలో తనవంతు కృషి చేశారన్నారు. సెయింట్ థెరిసా డిగ్రీ కళాశాల తెలుగు విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.అరుణ మాట్లాడుతూ స్త్రీ విద్య, వితంతు వివాహాల కోసం కందుకూరి ఎంతో కృషి చేశారని కొనియాడారు. మాతృభాష పరిరక్షణ కోసం పరితపించిన వ్యక్తి కందుకూరి అన్నారు. సాహిత్యంలో తెలుగు పదాలు వెతుక్కునే పరిస్థితి నేడు సమాజంలో ఉందని, ఈ పరిస్థితుల్లో తెలుగు భాషా ప్రామాణికతను కాపాడే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కె.కేశవరెడ్డి రచించిన, హేలాపురి బాలోత్సవం ప్రచురించిన «కార్యశూరుడు కందుకూరి» అనే పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్సీ రాము సూర్యారావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. భోజనానంతరం కందుకూరి బాటలో మహిళా చైతన్యం అనే అంశంపై జరిగిన సదస్సులో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీ.రమాదేవి మాట్లాడుతూ వీరేశలింగం మహిళలను చైతన్య పరిచేందుకు, వారి విద్యాభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. మహిళలు కందుకూరిని స్ఫూర్తిగా తీసుకుని మహిళల హక్కుల కోసం, రక్షణ కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. హేలాపురి బాలోత్సవం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ సుందరయ్య, సీఆర్‌ఆర్ విద్యా సంస్థల కార్యదర్శి ఎంబీఎస్‌వీ ప్రసాద్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సంకు మనోరమ, సాహితీ స్రవంతి రాష్ట్ర నాయకులు వరప్రసాద్ పాల్గొన్నారు.





# 'ఆంధ్ర' మరమ్మతులకు మోక్షం

- తుది దశలో ఆంధ్ర కాలువ మరమ్మతు పనులు
- దశాబ్ద కాలంగా మరమ్మతులకు నోచుకోని వైనం
- ఎంపీ నిధుల విడుదలతో ఎట్టకేలకు పనుల పూర్తి
- 30 వేల ఎకరాలకు కాలువ ద్వారా సాగునీటి సరఫరా



మరమ్మతు పనుల తరువాత ఆంధ్రా కాల్వ (నేడు)



గతంలో ముళ్ల చెట్లు, పూడికతో అధ్వానంగా ఉన్న ఆంధ్రా కాల్వ (నాడు)

చింతలపూడి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దశాబ్దాల చరిత్ర కలిగిన ఆంధ్రా కాల్వ మరమ్మతు పనులు తుదిదశకు చేరాయి. నిన్నటివరకు ముళ్ల పొదలు, పూడిక పేరుకుపోయి అధ్వానంగా ఉన్న కాల్వ నేడు మరమ్మతులు పూర్తయిన తరువాత కళకళలాడుతోంది. రైతుల వినతి మేరకు ఏలూరు పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్‌బాబు ఆంధ్రా కాల్వ మరమ్మతులకు తన పార్లమెంట్ నిధుల నుంచి రూ.30 లక్షలు కేటాయించారు. దీంతో కాల్వ మరమ్మతు పనులను అధికారులు చేపట్టారు. దశాబ్దాల కాలంగా మరమ్మతులకు నోచుకోకుండా పూడిక పెరిగి మెరక తేలి ముళ్ల పొదలతో ఆంధ్రా కాల్వ దైన్యంగా మారింది. దీంతో సాగునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిన ఆంధ్రాకాల్వకు నిధులు కేటాయించడంపై ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబుకు ఆయకట్టు రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. 1967లో ఏలూరు జిల్లాలోని మెట్ట ప్రాంతంలో 21 చెరువులకు సాగు నీరు అందించడానికి ఖమ్మం జిల్లా తుమ్మూరు వద్ద ఆనకట్ట నిర్మించారు. అక్కడి నుంచి 18 కిలోమీటర్ల పొడవున కాల్వ నిర్మాణం చేపట్టి వరద నీటిని సాగునీటి చెరువులకు మళ్లిస్తున్నారు. మండలంలో దాదాపు 11 వేల ఎకరాలకు అధికారికంగా, మరో 10 వేల ఎకరాలకు అనధికారికంగా ఏటా సాగునీరు అందుతోంది. దీంతో పాటు జిల్లాలోని చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం వద్ద నిర్మించిన తమ్మిలేరు ప్రాజెక్టు సైతం ఆంధ్రాకాల్వ ద్వారా వచ్చే వరద నీటిపై ఆధారపడి ఉంది. ఈ ప్రాజెక్టు కింద ఎన్‌టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల్లో అధికారికంగా 9,169 ఎకరాలు సాగవుతుండగా , ఏటి కాలువ దిగువన సుమారు 20 వేల ఎకరాలకు పైగా సాగు చేస్తున్నారు. ప్రతి ఏటా ఆంధ్రా కాల్వకు పలు చోట్ల గండి పడుతుండటంతో అధికారులకు, కాంట్రాక్టర్లకు కాసుల పంట కురిపిస్తోందనే విమర్శలు ఉన్నాయి. రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రాలోని నీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాల గురించి రాష్ట్రానికి చెందిన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలోని కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు కేంద్రం దృష్టికి తీసుకు వెళ్లలేకపోయారు. గతంలో అనేకసార్లు ఖమ్మం, ఏలూరు జిల్లాల రైతుల మధ్య సాగు నీటి వివాదం తలెత్తి ఘర్షణలు చోటుచేసుకున్న సంఘటనలు ఉన్నాయి. ఆంధ్రా కాలువ ద్వారా మన రాష్ట్రంలోని తమ్మిలేరుకు వచ్చే వరద నీరు రాకుండా ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువు అలుగు ఎత్తును పెంచి అక్కడి ప్రజాప్రతినిధులు అడ్డుకుంటూ వస్తున్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ వివాదంపై ముగ్గురు రాష్ట్ర స్థాయి రిటైర్డ్ ఇంజినీర్లను నియమించినా ఫలితం లేకుండాపోయింది. అనంతరం తెలంగాణ రాష్ట్రం ఏర్పడటంతో శాశ్వతంగా వరద జలాలను రాకుండా తెలంగాణ ప్రభుత్వం అడ్డుకుంటోంది. గతంలో నీటి వినియోగం విషయంలో ఒప్పందం ఉన్నప్పటికీ అమలు జరగడం

**ఎంపీ శ్రీధర్‌కు కృతజ్ఞతలు**



పార్లమెంట్ నిధులతో చేపట్టిన కాల్వ అభివృద్ధి పనులు చాలా వరకు పూర్తి కావచ్చాయి. దీంతో ఈ ఏడాది సాగు నీటికి ఇబ్బందులు తొలగినట్లే. ఆంధ్రాకాల్వ అభివృద్ధికి ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు 30 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు.

– గిరి భోగారావు, సొసైటీ చైర్మన్, ఆయకట్టు రైతు, చింతలపూడి

**శాశ్వత సాగునీటి వసతి కల్పించాలి**



ఆంధ్రా కాల్వ మరమ్మతు పనులను శాశ్వత ప్రాతిపదికన చేపట్టడంతో పాటు శాశ్వత సాగునీటి వసతి కల్పించడానికి చర్యలు తీసుకోవాలి. గతంలో అక్కడక్కడా పడ్డ గండ్లను పూడ్చడానికి పటిష్ట చర్యలు తీసుకోవాలి. వరదలు వస్తే గండ్లను పూడ్చక పోవడం వల్ల వరద నీరు పొలాలపై ప్రవహించి వృధాగా పోతోంది.

– గద్దె ప్రసాద్, రైతు, యండపల్లి

## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** పట్టణంలోని 33/11 కేవీ హౌసింగ్ బోర్డు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11కేవీ రిలయన్స్ ఫీడర్, 11 కేవీ సత్యవతినగర్ ఫీడర్‌లు విభజనలు, మరమ్మతులు నిమిత్తం ఈ నెల 28వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. హౌసింగ్‌బోర్డు, గాంధీ బొమ్మ సెంటర్, గణేష్ నగర్, వానపల్లిగూడెం, మామిడితోట, వీకర్స్ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, సిపాయిపేట, గాయత్రి గుడి ఏరియాలలో విద్యుత్ ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

### పాస్టర్ జాన్ మృతికి పలువురు సంతాపం


పాస్టర్ కె జాన్ (ఫైల్ ఫొటో)

**తణుకు టౌన్:** తణుకు ప్రాంతంలో క్రీస్తు సువార్త వ్యాప్తికి విశేష కృషి చేసిన పాస్టర్ కొడమంచిలి జాన్ మృతికి పలువురు సంతాపం తెలిపారు. సోమవారం తణుకు ఇరగవరం కాలనీలో గల పాస్టర్ జాన్ నివాసంలో తణుకు నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన పాస్టర్లు ఆయన కుటుంబ సభ్యులను కలసి తమ సానుభూతిని వ్యక్తం చేశారు. సోల్ విన్నింగ్ గాస్పెల్ టీ వ్యవస్థాపక డైరెక్టర్ అనేక ఆంధ్రా, తెలంగాణా ప్రాంతాల్లో సువార్త విస్తరణకు విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో తణుకు యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులతో పాటు ఉభయ గోదావరి, విశాఖ, ఖమ్మం జిల్లాలకు చెందిన పాస్టర్లు జాన్ కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతిని తెలిపారు.

### సెల్‌ఫోన్ వినియోగంపై అవగాహన


విద్యార్థులకు సెల్‌ఫోన్‌ల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**అత్తిలి:** విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండి, చదువుపై దృష్టి పెట్టాలని రిసోర్సుపర్సన్ కె కోమలి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో సోమవారం సెల్‌ఫోన్ వినియోగంపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్‌లు అధికంగా చూడటం వల్ల కళ్లు దెబ్బతింటాయని, కళ్లజోళ్లు వేసుకునే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. సెల్‌ఫోన్‌లు అవసరం మేరకే వాడాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి కృష్ణారావు, పి వెంకటేశ్వరరావు, జి గణపతి, బి మహాలక్ష్మి, ఎం శ్రీదేవి, ఆర్ దానకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**పెనుగొండ:** ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా విద్యార్థులను చేర్చుకుంటున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్య సభ్యులు కోరారు. సోమవారం సిద్ధాంతంలో వారు విలేకర్లతో మాట్లాడుతూ సిద్ధాంతంలో ఓ ప్రైవేటు పాఠశాల వారు విద్యార్థులకు ఉచిత సదుపాయాలంటూ మభ్యపెడుతున్నారని ఆరోపించారు. ఇప్పటివరకూ వారికి ఎటువంటి అనుమతులు లేకపోయినా అడ్మిషన్లు ప్రారంభించి విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకొంటున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్య సభ్యులు జి.కేశవ, జక్కం విజయకుమార్, టి. చంద్రశేఖర్, ఎం.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. దీనిపై పెనుగొండ ఎంఈఓ డి సుభాకర్‌ని వివరణ కోరగా ప్రస్తుతానికి ఆ ప్రైవేట్ పాఠశాలకు జిల్లా అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు రాలేదని స్పష్టం చేశారు.

### పిల్లలకు నీతి కథలు, పద్యాలు

**నరసాపురం:** నరసాపురం గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో సోమవారం పిల్లలకు నీతికథలు బోధించారు. అలాగే పిల్లల చేత తెలుగు అధ్యాపకులు పద్యాలు చదివించారు. తెలుగు టు ఇంగ్లీష్ ట్రాన్స్‌లేషన్, యోగా, చెస్ వంటి ఆటలు నేర్పించారు. ఈ వేసవి విజ్ఞాన తరగతులకు మంచి స్పందన వచ్చిందని, వచ్చే నెల 7వ తేదీతో శిక్షణ శిబిరం ముగుస్తుందని లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి చెప్పారు.

### దేశాలమ్మను దర్శించుకున్న గోపి

**పాలకొల్లు అర్బన్:** పాలకొల్లు పట్టణ దేవత దేశాలమ్మ అమ్మవారి జాతర పురస్కరించుకుని సోమవారం అమ్మవారిని వైఎస్సార్ సీపీ పాలకొల్లు ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టణ ప్రజలను చల్లగా చూడాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు గోపిని అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించారు. ఆయన వెంట పార్టీ పట్టణ అధ్యక్షుడు చందక సత్తిబాబు ఉన్నారు.

# అభివృద్ధికి చిరునామా తణుకు నియోజకవర్గం


అత్తిలిలో రూ. 32 కోట్లుతో నిర్మాణం చేసిన సీసీ రోడ్డు


తణుకులో రైల్వే స్టేషన్ రోడ్డును రూ. 50 లక్షలతో అభివృద్ధి చేసిన సీసీ రోడ్డు

- వీధివీధికీ సీసీ రోడ్లు
- నిర్మాణంలో ఉన్న ప్రధాన రహదారులు
- నియోజకవర్గంలో రూ. 1000 కోట్లు దాటిన అభివృద్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం


తణుకు హౌసింగ్ బోర్డు కాలనీలో సీసీ రోడ్డుగా మలచిన ప్రధాన రోడ్డు


తణుకు కోదండరామాలయం వీధిని సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసిన దృశ్యం

**తణుకు అర్బన్:** తణుకు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పరుగులు పెట్టడంతో వీధులన్నీ సుందరంగా తీర్చిదిద్దబడ్డాయి. వివిధ శాఖలకు సంబంధించి ఇప్పటికే భవనాల నిర్మాణాలు పూర్తికాగా రహదారులు, డ్రెయినేజీల నిర్మాణాలు పూర్తయ్యాయి. రూ. 1000 కోట్లు పైగా నిధులతో వివిధ శాఖలకు సంబంధించి తణుకు నియోజకవర్గంలోని తణుకు మునిసిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో అభివృద్ధి పనులు పోటాపోటీగా జరగడంతో ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**తణుకు నియోజకవర్గంలో...**

తణుకు నియోజకవర్గంలో 2019 సంవత్సరం నుంచి ఇప్పటివరకు తణుకు మునిసిపాలిటీ, ఆర్ అండ్ బీ, జిల్లా పరిషత్, పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యూఎస్, ఇరిగేషన్ శాఖ, విద్యుత్ శాఖలకు సంబంధించి రూ. వెయ్యి కోట్లు పనులు చేపట్టగా పనులు పూర్తయ్యాయి. ఇరగవరం, అత్తిలి ప్రధాన రహదారులు మాత్రం పూర్తికావాల్సి ఉంది. రహదారులు, డ్రెయినేజీలు, కమ్యూనిటీ హాల్స్, తాగునీరు, సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ సెంటర్‌లు, ఆర్‌బీకేలు, డిజిటల్ లైబ్రరీ భవనాలు, పార్కులు, విద్యుత్ సబ్ స్టేషన్‌లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్స్ వంటివి నిర్మాణం చేశారు. ముఖ్యంగా తణుకు నియోజకవర్గంలోని ఇరగవరం మండలం గవర్లపాలెం నుంచి పాలకోడేరు మండలం కోరుకొల్లు వరకు అత్తిలి మీదుగా రూ. 32కోట్లు నిధులతో ఆర్ అండ్ బీ విభాగంలో జరుగుతున్న రహదారి నిర్మాణం పట్ల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. మొత్తం 14 కిలోమీటర్లు మేర అత్తిలి గ్రామ పరిధిలో 770 మీటర్లు సిమెంట్ రోడ్డు, మిగిలిన 13,230 మీటర్లు తారు రోడ్డు పనులు చేపట్టారు. ఇరగవరం గ్రామ ప్రధాన రహదారిని 18 మీటర్ల నుంచి 21 మీటర్లకు పెంచి రూ. 2.50 కోట్లుతో కొంతమేర సిమెంట్ రోడ్డు, మరికొంత ఏరియా తారురోడ్డుగా మలుస్తున్నారు.

### అభివృద్ధి అంటేనే కారుమూరి



అత్తిలిలో రూ. 32 కోట్లు నిధులతో నిర్మాణం చేపట్టిన సిమెంట్ రోడ్డు, తారురోడ్డు చాలా కీలకం. 2009 సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాత్రమే అత్తిలిలో రహదారులు నిర్మాణం చేశారు. మళ్లీ ఇప్పుడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆయనే రహదారుల నిర్మాణాలు చేయిస్తున్నారు.

– పైబోయిన సత్యనారాయణ,
వైఎస్సార్ సీపీ అత్తిలి మండల అధ్యక్షుడు

### గతంలో అభివృద్ధి చేయలేదు



ఇరగవరం ప్రధాన రహదారిని రూ. 2.50కోట్లు నిధులతో సిమెంట్, తారురోడ్డుగా నిర్మాణం చేపట్టారు. మండలంలో చాలా చోట్ల సీసీ రోడ్లుగా అభివృద్ధి చేయడంతో ప్రజలంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ హయాంలో ఎటువంటి అభివృద్ధి చేయకపోవడంతో రహదారులు గుంతలుగా మారాయి.

– కొప్పిశెట్టి దుర్గాప్రసాద్,
వైఎస్సార్ సీపీ ఇరగవరం మండల అధ్యక్షుడు

### రూ. 300కోట్లతో అభివృద్ధి



జగనన్న ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రి కారుమూరి చొరవతో తణుకు మునిసిపాలిటీ పరిధిలో ఇప్పటివరకు రూ. 300కోట్లు పైగా నిధులతో రహదారులు, డ్రెయినేజీలు, సచివాలయ భవనాలు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించారు. తణుకు రైల్వే రోడ్డును రూ. 50 లక్షలు నిధులతో సీసీ రోడ్డు, డ్రెయిన్‌ను అభివృద్ధి చేశారు.

– మంగెన సూర్య,
వైఎస్సార్ సీపీ తణుకు పట్టణ అధ్యక్షుడు

### అభివృద్ధి ఘనత కారుమూరిదే



తణుకు మండలంలో రహదారులు సీసీ రోడ్లు, తారు రోడ్లుగా అభివృద్ధి చేసిన ఘనత మంత్రి కారుమూరికి మాత్రమే దక్కుతుంది. మండలంలోని గ్రామాల్లో ప్రజలు అడిగిన వెంటనే రహదారులను అభివృద్ధి చేయగలిగాం. జగనన్న కాలనీలతోపాటు ఆర్‌బీకే, సచివాలయాల భవనాలు నిర్మాణం చేసి అందుబాటులోకి తీసుకువచ్చారు.

– బోడపాటి వీర్రాజు,
వైఎస్సార్ సీపీ తణుకు మండల అధ్యక్షుడు

### దివ్యాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు


చినతాడేపల్లి గ్రామంలో దివ్యాంగ పిల్లల్ని గుర్తించిన దృశ్యం

**తాడేపల్లిగూడెం రూరల్:** సాధారణ పిల్లలతో సమానంగా దివ్యాంగ పిల్లలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అందేలా కృషి చేస్తామని ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే.బాల ఈశ్వరయ్య, ఎం.చంద్రకుమారి అన్నారు. సోమవారం మండలంలోని చినతాడేపల్లి గ్రామంలో అంగన్‌వాడీలకు దివ్యాంగ పిల్లల గుర్తింపు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామసచివాలయం, పీహెచ్‌సీ, ఇంటింటికి తిరిగి సర్వే చేసి 20 మంది బడి బయట దివ్యాంగ పిల్లలను గుర్తించామన్నారు. భవిత కేంద్రంలో కల్పించే సౌకర్యాలను దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

### ఉపాధి కూలీలకు రూ.600 కూలి చెల్లించాలి


ఉప్పరగూడెం గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న కండెల్లి సోమరాజు

**తాడేపల్లిగూడెం రూరల్:** ఉపాధి హామీ పథకం కూలీలకు రోజుకు రూ.600లు కూలి చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కృష్ణాయపాలెం, ఉప్పరగూడెం గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులను సందర్శించారు. ఈ సందర్భంగా కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సోమరాజు మాట్లాడుతూ పాత పనిముట్ల స్థానంలో కొత్త వాటిని అందించాలని, 200 పనిదినాలు కల్పించాలని, కేంద్ర బడ్జెట్‌లో రూ. 2లక్షల కోట్లు ఉపాధి హామీ పథకానికి కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జి.రంగారావు, గంగాభవాని, గంజి లక్ష్మణరావు, సీహెచ్.నాగేశ్వరరావు, మేరీకుమారి, పొట్ల ధనలక్ష్మి, ధర్మయ్య, సుజాత, యడవల్లి వేణు తదితరులు పాల్గొన్నారు.

## దోమకాటు నుంచి ప్రజారోగ్యాన్ని పరిరక్షిద్దాం


ఆరోగ్య సిబ్బందిచే హెల్త్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** ప్రజారోగ్య పరిరక్షణ కోసం వైద్య ఉద్యోగులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజల్ని వ్యాధుల బారి నుంచి రక్షించాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు పేర్కొన్నారు. కాలానుగుణ వ్యాధులపై పట్టణ ఆరోగ్య కేంద్రం బేబి సెంటర్ పరిధిలో 9,11 వార్డులలో ఫ్రైడే, డ్రై డేలు కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సోమవారం పరిశీలనలు జరిగాయి. హెల్త్ అధికారులు, సిబ్బంది ప్రజలతో మమేకమై పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వారంలో ఒక రోజు డ్రై డే, ఫ్రైడే పాటించడం ద్వారా డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చునని చెప్పారు. హెల్త్‌బార్ కంట్రోల్ హైజీన్‌లను పర్యవేక్షించారు. వార్డులలో ఆరోగ్య అవగాహన ర్యాలీలు జరిగాయి. దోమల లార్వాలను కనుగొనటలో సిబ్బంది సాంకేతికంగా ముందు వరసలో ఉండాలని చెప్పారు. ఇళ్లలో ఉన్న నీటిని నిల్వ చేసే కంటైనర్లు, ఓవర్‌హెడ్ ట్యాంక్స్, ఫ్రిజ్‌లు, కూలర్స్‌ను విధిగా పరిశీలించుకోవాలని, లార్వాలు పుట్టకుండా చూడాలన్నారు. అనుమానిత జ్వరం కేసులను ప్రాథమిక పరీక్షల కోసం సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు పంపాలని చెప్పారు. వార్డు ఆరోగ్య కార్యదర్శులు పోసమ్మ, టి.ఎస్.లక్ష్మి, ఆరోగ్య సహాయకులు కాంతారావు, ఆశా కార్యకర్తలు సుజాత, సుమలత, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

### వరి కోతల అనంతరం చేలల్లో దుక్కులు దున్నాలి

**అత్తిలి:** రబీ వరికోతలు అనంతరం భూసారం తగ్గకుండా ఉండాలంటే తగినంత తేమ ఉన్నప్పుడు వాలుకు అడ్డంగా లోతైన దుక్కులు దున్నాలని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ సూచించారు. వేసవిలో అడపాదడప కురిసే వానలను సద్వినియోగం చేసుకుని భూములు దున్నుకోవాలన్నారు. లోతుగా అడ్డంగా దున్నకపోతే భూమికోతకు గురౌతుందన్నారు. లోతుగా దున్నటం వలన నీరు ఆవిరైపోకుండా తేమను నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. వేసవి దుక్కుల వల్ల తెగుళ్లను గురిచేసే గుడ్లు, బైటకు రావడం వల్ల పక్షులు తిని నాశనం చేస్తాయన్నారు. నేలను దమ్ము చేసేముందు గడ్డిని తగులబెట్టవద్దని, దీనివల్ల నేలలో పోషకాల సమతుల్యం లోపిస్తుందని తెలిపారు.

### డ్రెయిన్ల పూడికతీత పనుల పరిశీలన

**నరసాపురం:** వేసవి ముగిసేలోగా పట్టణంలోని అన్ని ప్రధాన డ్రెయిన్లను శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. పట్టణంలోని మెయిన్‌రోడ్డులో డ్రెయినేజీలో సిల్ట్ తీసే పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్రెయిన్ నుంచి బయటకు తీసిన వ్యర్థాన్ని వెంటనే అక్కడనుంచి తొలగించాలని చెప్పారు. లేదంటే పారిశుధ్య ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. పట్టణంలో మిగిలినచోట్ల కూడా డ్రెయినేజీలు వెంటనే శుభ్రం చేయాలని, లేదంటే అధిక వర్షాలు పడితే మురుగు పారక ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెప్పారు.

### పదోతరగతి సప్లిమెంటరీ ఇంగ్లీషు పరీక్ష ప్రశాంతం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి సోమవారం మూడో రోజున ఇంగ్లీషు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని ఏడు స్కూల్స్ జెడ్పీ ఉన్నత పాఠశాల, కడకట్ల మునిసిపల్ హైస్కూల్, సుబ్బారావుపేట మునిసిపల్ హైస్కూల్, కింబర్లీ, మాంటిస్సోరి, సెంట్ జోన్స్, భాష్యం స్కూల్‌లో జరిగాయి. 266 మంది విద్యార్థులకు గాను 47మంది పరీక్షలకు హాజరయ్యారు. 219 మంది పరీక్షలకు హాజరుకాలేదు.

### అలంపురంలో నేడు ఉచిత నోటి క్యాన్సర్ పరీక్షలు

**పెంటపాడు:** ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం సందర్భంగా అలంపురంలోని వెంకటరమణ సేవా చారిటీ ఆస్పత్రిలో ఈనెల 28న ఉచిత నోటి క్యాన్సర్ పరీక్షలు చేయనున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు కొలనువాడ పెదకృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. నోటి సంబంధ ప్రత్యేక వైద్యులు, ప్రొఫెసర్ హెడ్‌లు అయిన డాక్టర్ ఎం. రవికాంత్, డాక్టర్ బి. రమేష్, డాక్టర్ కెఎస్ చైతన్యరామ్‌లు పరీక్షలు చేసి మందులను అందజేస్తారని తెలిపారు.

### నేడు చెస్ పోటీలు

**నరసాపురం:** ఏపీ చెస్ అసోసియేషన్, మాస్టర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నూలి పాయి అభయ్ స్మారక ఆల్ ఇండియా చెస్ పోటీలు మంగళవారం పట్టణంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు అభయ్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు నూలి శ్రీనివాస్ చెప్పారు. పోటీల్లో 500 మంది క్రీడారులు పాల్గొంటారన్నారు. విజేతలకు రూ 64 వేల ప్రైజ్‌మనీ అందజేస్తామని తెలిపారు. గత ఏడేళ్లుగా అభయ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

## గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలి


మాట్లాడుతున్న వైద్యాధికారి కె నాగరాజు

**అత్తిలి:** గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికారం తీసుకోవాలని అత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె నాగరాజు కోరారు. సోమవారం అత్తిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ సంయుక్తంగా కన్వర్జెన్సీ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి నాగరాజు మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణులను గుర్తించి తగిన వైద్య సేవలు అందజేయడం ద్వారా తల్లి బిడ్డలు క్షేమంగా ఉండేటట్లు చేయాలని చెప్పారు. చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలని, పౌష్టికాహారం అందించాలని, ఐరన్‌ఫోలిక్ ట్యాబ్లెట్స్ ఇవ్వాలన్నారు. యుక్త వయస్సు పిల్లలకు శానిటరీ నాప్కిన్స్ అందజేయాలని కోరారు. ప్రసవం చేసే ఆస్పత్రిలో గర్భిణులకు వైద్యపరీక్షలు చేయించాలన్నారు. ప్రభుత్వం అందించే వైద్యసేవలు, ఆర్థిక ప్రయోజనాలు వారికి అందేలా చూడాలన్నారు. ఆడపిల్లలను బ్రతకనిద్దాం- ఆడపిల్లలను రక్షించుకుందాం అనే నినాదాన్ని ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఐసీడీఎస్ సీడీపీఓ ఎం ప్రమోదకుమారి, హెల్త్ ఎడ్యుకేటర్ జి ప్రమీలారాణి, ఎంపీహెచ్ఎస్ జి అమ్మాజీ, సీహెచ్ఓ డి సూర్యరేఖ, హెల్త్ అసిస్టెంట్ జెఎస్ గనిరాజు పాల్గొన్నారు.

## తొలి, మలి సంధ్య వేళలో...


గూడెంలో సూర్యోదయం


గూడెం పట్టణం బయట సూర్యాస్తమయం

**తాడేపల్లిగూడెం:** తొలిసంధ్య వేళలో.. తొలి పొద్దుపొడుపులో తెలవారే తూరుపులో వినిపించే రాగం భూపాలం. ఎగిరొచ్చే కెరటం సింధూరం అన్న సినీకవి భావానికి అచ్చమైన దృశ్యరూపాలుగా పొద్దుపొడుపు. పొద్దుగుంకడం ఉంటాయి. ప్రాత:కాల సమయం, పక్షుల కిలకిలా రావాలు. అప్పుడే లేచి బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటూ ఆవలింపులనే కిరణాలను వెదజల్లుతూ ఆకాశానికి ఎర్రని రంగును అద్దుతూ వచ్చే సూర్యోదయం కన్నుల విందు చేసింది. సాయం వేళ జీవితమే రంగుల వలయం దానికి ఆరంభం సూర్యుని ఉదయం అన్నట్టుగా ఈ దృశ్యం ఉంది.సాగరమే పొంగుల నిలయం దానికి ఆలయం సంధ్యాసమయం అన్నట్టుగా సూర్యాస్తమయం ఉంది. ఈ రెండు దృశ్యాలు సోమవారం గూడెంలో ఆకాశానికి రంగుల సంబరాన్ని చూపించాయి.

# కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు


తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు


ఇరగవరం: విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

**తణుకు టౌన్:** విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులలో భాగంగా తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తక పఠనం, పుస్తక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించే వివిధ అంశాలను రీసోర్సు పర్సన్‌లు వివరించారు. ఈకార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో కే సత్యనారాయణ, వైఎస్ఎన్ వసంతరావు, బసవేశ్వరరావు, గ్రంథాలయ అధికారి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

**పుస్తక పఠనం ద్వారా విద్యార్థులకు విజ్ఞానం**


పెంటపాడు : శాఖా గ్రంథాలయంలో పుస్తక, పత్రిక పఠనం చేస్తున్న విద్యార్థులు

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** పుస్తక పఠనం ద్వారా విద్యార్థులకు విజ్ఞానం వస్తుందని పలువురు విశ్రాంత ఉపాధ్యాయులు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం సోమవారం గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో నిర్వహించారు. విశ్రాంత అధ్యాపకులు గిరికపాటి బాపయ్య శర్మ, ప్రత్తి వీరాస్వామి, సత్యంలచే తొలుత పుస్తక పఠనం, కందుకూరి వీరేశలింగం జీవిత విశేషాలు, సైన్స్ పాఠ్యాంశాలు, రుతుపవనాలు, లెక్కలు, చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లీషు, ఎల్ఐసీ ఉద్యోగి రామాంజనేయులు ఆధ్యాత్మిక విషయాలను, యోగా మాస్టార్ పాండు విద్యార్థులకు యోగా నేర్పించారు. వివిధ గేమ్స్ ఆడించారు. వివిధ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

**ముగిసిన శిక్షణ తరగతులు**

**ఇరగవరం:** మండలంలోని కొత్తపాడు గ్రామంలో బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. ఈనెల 3 నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు కంప్యూటర్‌పై ప్రాథమిక అవగాహన, గణితంలో మెళకువలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు ధ్రువపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కమ్యూనిటీ సభ్యులు రామభద్రరాజు, కోఆర్డినేటర్ జీవీఎస్ఎస్ రవిఆనంద్, గ్రామ సర్పంచ్ బి.శ్రీను, ఎంపీపీ కె.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

**వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి**

**పెంటపాడు:** మండలంలోని పెంటపాడు శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి జుల్ఫికర్ ఆలీ తెలిపారు. సోమవారం గ్రంథాలయంలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గ్రంథాలయ అధికారి జుల్ఫికర్ ఆలీ ఆధ్వర్యంలో పలువురి విద్యార్థులకు శిక్షణ అందించారు. సెలవులలో పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. ఉచిత కంప్యూటర్ శిక్షణ అందించారు. పెంటపాడు ప్రభుత్వ బేసిక్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

### ఘనంగా పైడి మారెమ్మ తల్లి జాతర


విశేషాలంకరణలో దర్శనమిస్తున్న పైడి మారెమ్మ అమ్మవారు

**మొగల్తూరు:** రామన్నపాలెం పంచాయతీ జెట్టిపాలెం గ్రామంలో వేంచేసియున్న పైడి మారెమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. తొలిరోజు ఆదివారం గండర దీపారాధన వెలిగించి ఉత్సవాలను ప్రారంభించగా రెండో రోజు సోమవారం ఉదయం నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతించారు. అమ్మవారిని గ్రామంలో ఊరేగించి నిప్పుల గుండం నిర్వహించారు. రామన్నపాలెం గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. మరో రెండు రోజులపాటు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని, 30వ తేదీన భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.